ప్రజారక్షణ భేరి సభకు తరలిరండి


మాట్లాడుతున్న ఆంజనేయులు

దొనకొండ: రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధన కోసం సీపీఎం ప్రణాళిక రూపొందించిందని, దానిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు తెలిపారు. ఆదివారం దొనకొండలో సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నవంబర్ 15న గ్రామాల నుంచి విజయవాడకు ప్రజా రక్షణ భేరి సభకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.











కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట:

మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి


ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ

అంకమ్మతల్లికి ఘనంగా పొంగళ్లు

తాళ్లూరు (ముండ్లమూరు): మండలంలోని విఠలాపురం గ్రామంలో అంకమ్మతల్లికి ఆదివారం ఘనంగా పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన మారం వారి కుటుంబ సభ్యులు అంకమ్మతల్లికి పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించారు. వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ పరిశీలకుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి, చీమకుర్తి మాజీ సర్పంచ్ మారం వెంకటేశ్వరరెడ్డి, మాజీ కౌన్సిలర్ కోటా రాములు, నాయకులు మారం పురుషోత్తమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న మారం కుటుంబ సభ్యులు

వర్షాల కోసం ప్రత్యేక పూజలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కొంగలవీడు గ్రామ ప్రజలు వర్షాల కోసం గ్రామ సమీపంలో గల అంకాల పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామం నుంచి కుంకుమ బండ్లను కట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తపల్లెలో పోలేరమ్మ జాతర

బేస్తవారిపేట: మండలంలోని ఆర్ కొత్తపల్లెలో ఆదివారం పోలేరమ్మ జాతర నిర్వహించారు. గ్రామంలో ఇంటి నుంచి బోనాలు ఎత్తుకుని, కుంకుమ బండ్లతో ఊరేగింపుగా పోలేరమ్మ ఆలయం వద్దకు తరలివెళ్లారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడికి నిరసన


మార్కాపురంలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ యూనియన్ నాయకులు



పొదిలి డిపో వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: కావలిలో ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఆదివారం మార్కాపురం డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. నెల్లూరు జోనల్ సహాయ కార్యదర్శి సోమయాజుల శాస్త్రి, ఎన్ఎంయూ డిపో కార్యదర్శి కె.కాశయ్య మాట్లాడుతూ.. డ్రైవర్‌పై దాడిచేసిన వారిని అరెస్టు చేసి శిక్షపడేలా చూడాలని కోరారు. ఘటనపై వేగంగా స్పందించిన ఎండీ ద్వారకా తిరుమలరావు, జోనల్ చైర్‌పర్సన్ బత్తుల సుప్రజారెడ్డి, కావలి ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆయా యూనియన్ల నాయకులు సయ్యద్ బాషా హుస్సేన్, శేఖర్‌నాయుడు, బత్తుల వెంకటేశ్వర్లు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: కావాలి వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడిని నిరసిస్తూ పొదిలి డిపో గ్యారేజీ గేటు వద్ద ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది ఓబులేసు, షరీఫ్, మూర్తి, శేషయ్య, బాషా, దివాకర్, కొండలరావు, పీపీఎస్ రెడ్డి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు పూల సుబ్బయ్య


నాయకులతో ఎమ్మెల్యే అన్నా..

కంభం: పోరాట యోధుడు పూల సుబ్బయ్య అని స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. తురిమెళ్ల హైస్కూల్ ఆవరణలో వెలుగొండ ప్రాజెక్టు స్ఫూర్తి ప్రధాత పూలసుబ్బయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు ఎనలేని సేవలందించి ప్రజాసేవకుడిగా గుర్తింపు పొందాడన్నారు. నికర జలాలను ఎత్తుపల్లాలకు చేర్చాలనే దృఢ నిశ్చయంతో వెలుగొండ ప్రాజెక్టు స్ఫూర్తి దాతగా నిలిచిపోయాడన్నారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా ప్రజలకు ఎనలేని సేవలను అందించాడని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. గిద్దలూరు వైస్ చైర్మన్ ఆర్.డి.రామక్రిష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు కుప్పా రంగనాయకులు, ముద్దర్ల శ్రీను పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సమారాధనలో ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, కుసుమ హరనాథస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన సమారాధన మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు వాడకట్ల సత్యనారాయణ, పెండ్యేల కిరణ్, కోటా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు.. పెట్రోల్ వాసనొస్తున్నాయ్

కొనకనమిట్ల: కొనకనమిట్ల బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న హిందుస్థాన్ పెట్రోల్ బంక్ సమీపంలో ఇళ్లలోని బోర్ల నీరు గత కొన్ని రోజులుగా పెట్రోల్ వాసన వస్తుండటంపై ఆ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెట్రోల్ బంక్‌లోని ట్యాంక్ ఏమైనా లీకై ఉంటుందేమో పరిశీలించాలని బంక్ యజమానులకు తెలిపినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆదివారం నిరసన తెలిపారు. వాహనాలకు పెట్రోల్ కొట్టకుండా స్థానికులు నుసుం శ్రీను, రమణయ్య, బుడ్డారెడ్డి, రామకృష్ణ, వేంపాటి వెంకటరెడ్డి తదితరులు అడ్డుకున్నారు. వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని బంక్ యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా రమేష్‌రెడ్డి

గిద్దలూరు రూరల్: కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా పిడతల రమేష్‌రెడ్డిని బీజేపీ అధ్యక్షురాలు పురంధరేశ్వరి నియమించినట్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా భారతీయజనతా పార్టీ తన పై నమ్మకం ఉంచి తనకు కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం

- ఎస్‌సీవీకే నిలయం కార్యదర్శి సుబ్బారెడ్డి

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలో 125 వసంతాలు పూర్తి చేసుకుంటున్న కొప్పరపు వెంకటకృష్ణ కళానిలయం అభివృద్ధికి కృషి చేయడంతోపాటు కళాకారులకు చేయూతనిస్తూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని కార్యదర్శిగా మూడోసారి ఎన్నికైన మార్కెట్ యార్డు మాజీ కార్యదర్శి గుంటక సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రీడింగ్ రూమ్ ఆవరణలో సర్వసభ్య సమావేశం, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. తనను మూడోసారి ఎన్నుకున్నందుకు సుబ్బారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. అధ్యక్షులు డాక్టర్ బాల సుబ్బారావు మాట్లాడుతూ రీడింగ్ నిలయం అభివృద్ధికి ఎమ్మెల్యే కెపి నాగార్జునరెడ్డి సహకారం మర్చిపోలేమని, అలాగే ఉపాధ్యక్షులుగా ఎన్నికైన శాసనాల వీరబ్రహ్మం, ఆడిటర్ తోట సత్యనారాయణ, షెక్షావలి, ఇంకా పలువురు ప్రముఖులు కృషి చేశారన్నారు. కోశాధికారిగా పి.మల్లికార్జునరావును, జాయింట్ సెక్రటరీగా ఎం.రామ్మోహన్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుంటక సుబ్బారెడ్డి, శాసనాల బ్రహ్మం, బాల సుబ్బారావును రాష్ట్ర ఎమ్ఎస్ఎమ్ఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా వెంకట బద్రీనాథ్, వైఎస్సార్ సీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, అంతర్జాతీయ ఆర్యవైశ్య సంఘ సెక్రటరీ చాటకొండ నాగరాజు, గుంటూరు రైల్వే డివిజన్ మెంబరు ఆర్‌కేజే నరసింహం, ఐడియల్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రమేష్, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముత్తారెడ్డి వెంకటరెడ్డి, ప్రముఖ వ్యాపారవేత్తలు నాగేళ్ల వెంకటేశ్వర్లు, కందెపు రంగయ్య, మధు తదితరులు సన్మానించారు. ఎన్నికల అధికారులుగా డేవిడ్‌స్టోన్, సీహెచ్ మల్లికార్జునరావు వ్యవహరించారు.


గుంటక సుబ్బారెడ్డి, బ్రహ్మంను అభినందిస్తున్న బద్రీనాథ్ తదితరులు

చట్టసభల్లో నూర్‌బాషాలకు ప్రాధాన్యత ఇవ్వాలి


గుంటూరు వెళ్తున్న నాయకులు

మార్కాపురం: రానున్న ఎన్నికల్లో నూర్‌బాషాలకు చట్టసభల్లో స్థానం కల్పించాలని కోరుతూ ఆదివారం గుంటూరులో నిర్వహించిన నూర్‌బాషాల సింహగర్జన సభకు మార్కాపురం వైఎస్సార్ సీపీ నాయకులు, రాష్ట్ర నూర్‌బాషా యూత్ అధ్యక్షుడు, కేతగుడిపి సర్పంచ్ డి.పెద్ద మస్తాన్ ఆధ్వర్యంలో 150 వాహనాల్లో గుంటూరుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ.. నూర్ బాషా కులస్తులు మైనార్టీల్లో అంతర్భాగమైనప్పటికీ రాజకీయంగా సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ మీరావలి, మీర్జాపేట సర్పంచ్ మీరయ్య, 18,23 వార్డు కౌన్సిలర్లు కరీముల్లా, డి.ప్రసాద్, సిద్ధవరం ఎంపీటీసీ మీరావలి, మునగపాడు సర్పంచ్ నబీ సాహెబ్, సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆదాం సాహేబ్ పాల్గొన్నారు.

దువా పేరుతో మోసం

పొదిలి రూరల్: దువా పేరుతో ఓ మహిళను ఇద్దరు వ్యక్తులు మోసగించి రూ.11 వేల నగదుతో ఉడాయించారు. పొదిలి పట్టణంలోని పడమటి పాలెం వీధిలో నివాసం ఉంటున్న షేక్ బషీరా ఇంటికి ఆదివారం ఇద్దరు వ్యక్తులు ఫకీర్ వేషంలో వెళ్లారు. దుష్ట శక్తులు పోయేందుకు దువా చేస్తామని మాయమాటలు చెప్పారు. దువా సమయంలో రూ.11 వేలు పెట్టాలని, ప్రార్థన కాగానే ఇచ్చేస్తామని నమ్మబలికి ఉడాయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట సైదులు తెలిపారు.







